

వాహనంలో నుంచి నిందితులను తీసుకొస్తున్న పోలీసులు





వీధి లైట్ల వెలుతురులో నిందితులకు గుర్తింపు పరీక్షలు



జడ్జిల నివాస సముదాయం వద్ద పోలీసులు

'సిట్' కార్యాలయంలో

రోజంతా టెన్షన్ టెన్షన్

- పోలీసుల ఉరుకుల పరుగులు
- తమిళనాడు న్యాయవాదుల హడావిడి
- కల్తీ నెయ్యి కేసులో అర్ధరాత్రి రెండు డెయిరీల డైరెక్టర్లు అరెస్టు
- నిందితులకు నడిరోడ్డుపై గుర్తింపు పరీక్షలు

- **సెప్టెంబరు 18:** చంద్రబాబు ప్రకటనతో కలకలం
- **అక్టోబరు 4:** సుప్రీంకోర్టు సిట్ నియామకం
- **నవంబరు 24:** సిట్ సిబ్బంది రాక
- **డిసెంబరు 13:** సిట్ కీలక అధికారుల రాక
- **ఫిబ్రవరి 9:** తొలి అరెస్టులు

తిరుపతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో సుప్రీంకోర్టు నియమించిన సిట్ బృందం కోసం కార్యాలయం ఏర్పాటైన తిరుపతి అలిపిరిలోని భూదేవి కాంప్లెక్సులో ఆదివారం ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఏఆర్ డెయిరీ, వైష్ణవీ డెయిరీల డైరెక్టర్లను అరెస్టు చూపించే క్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది ఉరుకులు పరుగులు తీయడంతో సందడి నెలకొంది. దానికితోడు తమిళనాడు, తిరుపతిలకు చెందిన న్యాయవాదుల హడావిడి కూడా కనిపించింది. కీలక నిందితుల అరెస్టు నేపథ్యంలో సిట్ అధికారులు, సిబ్బంది భోజనాలకు సైతం ఇళ్ళకు వెళ్ళకుండా కార్యాలయానికే తెప్పించుకున్న పరిస్థితి కనిపించింది. సిట్ బృందానికి కార్యాలయం ఏర్పాటు చేసిన తిరుపతి అలిపిరిలోని భూదేవి కాంప్లెక్సులోకి గత నవంబరు 23వ తేదీ నుంచీ ఇతరులను ఎవరినీ అనుమతించడం లేదు. చెక్‌పోస్టు కూడా ఏర్పాటు చేసి సిట్ సిబ్బందిని తప్ప ఇతరుల రాకపోకలపై ఆంక్షలు విధించారు. దీంతో ఈ ప్రాంతం శనివారం వరకూ ఎలాంటి హడావిడి లేకుండా కనిపించేది. ఆదివారం పరిస్థితి మారింది. ఉదయం నుంచే పోలీసు అధికారులు, సిబ్బంది రాకపోకలు పెరిగాయి. మధ్యాహ్నానికి ఏఆర్ డెయిరీ, వైష్ణవీ డెయిరీల డైరెక్టర్లను, ఇతర సిబ్బందిని పోలీసులు భూదేవి కాంప్లెక్సుకు తీసుకొచ్చారు. దాంతో ఆయా డెయిరీల అధికారులు, యజమానుల సన్నిహితులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఆపై తమిళనాడు, తిరుపతికి చెందిన న్యాయవాదులూ వచ్చారు. నిందితుల అరెస్టు నేపథ్యంలో రిమాండు రిపోర్టు తయారీలో పోలీసు అధికారులు మల్లగుల్లాలు పడ్డారు. కేసు దర్యాప్తు అధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వెంకట్రావు అక్కడే మకాం వేసి స్వయంగా రిమాండు రిపోర్టు రూపొందించారు. రాత్రి 8.20 గంటలకు రిపోర్టు సిద్ధం కావడంతో భారీ బందోబస్తు నడుమ నలుగురు నిందితులను వైద్య పరీక్షల నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించాక 9.10 గంటలకు తిరుపతి రాయలచెరువు రోడ్డులోని జడ్జిల నివాస సముదాయం వద్దకు తరలించారు.

అర్ధరాత్రి రిమాండు

ఆదివారం రాత్రి 11 గంటలకు రెండో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ప్రవీణ్ కుమార్ ఎదుట నిందితులను హాజరుపరచగా వారికి 14 రోజుల పాటు ఆయన రిమాండు విధించారు. అనంతరం 11.30 గంటల సమయంలో నిందితులను పోలీసులు తిరుపతి సబ్ జైలుకు తరలించారు.



భూదేవి కాంప్లెక్సులోని సిట్ కార్యాలయం

నడిరోడ్డుపైనే గుర్తింపు పరీక్షలు

రాత్రి 9.10 గంటలకు నిందితులను జడ్జిల నివాస సముదాయం వద్దకు తీసుకురాగా వాహనాలను రోడ్డుకు ఇరువైపులా పార్కు చేసి జడ్జి అనుమతి కోసం పోలీసు అధికారులు నిరీక్షిస్తూ గడిపారు. రాత్రి 10.33 గంటలకు దర్యాప్తు అధికారి, అదనపు ఎస్పీ వెంకట్రావు, ఏపీపీ ఇరువురూ అక్కడికి చేరుకున్నారు. 11 గంటలకు జడ్జి ఎదుట నిందితులను హాజరు పరిచారు. అంతకు మునుపు జడ్జిల నివాస సముదాయం ఎదుట రోడ్డుపైనే నిందితులకు పోలీసు అధికారులు గుర్తింపు పరీక్షలు నిర్వహించారు. ఈఎస్ఐ ఆస్పత్రి గేటు వద్ద వీధి దీపాల కింద నిందితులను నిలబెట్టి గుర్తింపు చిహ్నాలు నమోదు చేశారు.



రిమాండు విధించాక నిందితులను వెలుపలకు తీసుకొస్తున్న పోలీసులు



శ్రీవారి సేవలో శ్రద్ధ

తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం వేకువజామున సుప్రభాత సేవలో పాల్గొని, స్వామిని దర్శించుకుని వస్తున్న సినీ నటి శ్రద్ధాశ్రీనాథ్

ఆగని బాంబు
బెదిరింపులు

- తిరుపతిలో మరో రెండు హోటళ్లకు మెయిల్స్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హోటళ్లకు బాంబు బెదిరింపులు ఆగడంలేదు. హ్యూమన్ ఐఈడీ బాంబు పేరుతో హోటళ్ల పేల్చేస్తామని, అందరూ బయటకు వెళ్లిపోవాలని బెదిరిస్తూ రీనెస్ట్, పై వైస్రాయ్ హోటళ్లకు ఆదివారం మెయిల్స్ వచ్చాయి. ఆయా హోటళ్ల యజమానుల ఫిర్యాదుతో అలిపిరి ఎస్ఐ నాగార్జునరెడ్డి, బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలు ఆయా హోటళ్లకు చేరుకున్నారు. పరిసర ప్రాంతాలు, గదులు, వంటగది.. ఇలా అణువణువు తనిఖీలు చేశారు. ఈ మెయిల్స్ అన్నీ కేరళ నుంచి వస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. కాగా, రెండు రోజుల కిందట తిరుచానూరు సమీపంలోని గ్రాండ్ రిడ్జ్.. అంతకుముందు తిరుపతి రూరల్ పరిధిలోని వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. అలాగే, నాలుగు నెలల కిందట ఈ రెండు హోటళ్లతో పాటు, మరో నాలుగింటికీ బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ప్రతి సారి బాంబు, డాగ్ స్క్వాడ్లు తనిఖీలు చేసి ఎలాంటి బాంబులు లేవని తేల్చేస్తున్నారు.



రీ నెస్ట్ హోటల్‌లో తనిఖీ చేస్తున్న బాంబు, డాగ్ స్క్వాడ్లు

ఇదంతా ఎవరి పని?

తిరుపతికి వరుస బాంబు బెదిరింపు మెయిల్స్ ఎవరు పంపుతున్నారనేది ప్రశ్నగా మారింది. ఈ మెయిల్ అడ్రస్‌లు ఎవరివి? ఎక్కడ్నుంచి పంపుతున్నారు? ఏమి ఆశించి ఇలా బెదిరిస్తున్నారనేది అంతుపట్టడం లేదు. దోపిడీ దొంగలు, ఎర్రచందనం స్మగ్లర్లు, గంజాయి బ్యాచ్‌ల కింగ్‌పిన్‌లను సైతం విదేశాల నుంచి పట్టుకొచ్చిన మన పోలీసులు... బెదిరింపు మెయిల్స్ ఆగంతకులను గుర్తించలేకపోతున్నారు. ఇకనైనా పోలీసులు ఈ ఘటనలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, బెదిరింపు మెయిల్స్ పంపుతున్న నిందితులను గుర్తించి.. వారి ఆటకట్టించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నాళ్లీ కష్టం

వీల్ చైర్లు ఇవ్వరు. స్ట్రెచర్లు ఏమవుతాయో తెలియదు. సిబ్బంది ఉన్నారో లేదో..! కానీ, వైద్యం కోసం రుయాస్పత్రికి వచ్చే రోగుల సహాయకులకు మాత్రం తిప్పలు తప్పడంలేదు. కాలు దెబ్బతగిలిన వ్యక్తికి ఆదవారం రుయా ఎమర్జెన్సీ వార్డులో వైద్యం అందించారు. ఆ తర్వాత స్కానింగ్ తీసుకు రమ్మన్నారు. దీంతో ఆ రోగి సహాయకుడు ఇలా ఎత్తుకొని స్కానింగ్ కేంద్రానికి వెళ్లాల్సి వచ్చింది. ఈ ఒక్క రోజే కాదు.. రుయాలో తరచూ కనిపించే దృశ్యాలివి. ఇకనైనా అధికారులు ఇటువంటి వాటిపై దృష్టి సారించి రోగులు, వారి సహాయకుల ఇబ్బందులకు పరిష్కారం చూపాల్సి ఉంది.

- తిరుపతి (వైద్యం), ఆంధ్రజ్యోతి



23 మద్యం షాపులకు 185 దరఖాస్తులు

- జిల్లాలో గీత కార్మికుల దుకాణాలకు అనూహ్య స్పందన
- నేడు ఎంపిక, కేటాయింపులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గీత కార్మికుల మద్యం దుకాణాలకు అనూహ్య స్పందన లభించింది. గతంలో నోటిఫికేషన్ జారీ చేసినా అనుకున్న స్పందన రాక పోవడంతో ప్రభుత్వం మళ్లీ దరఖాస్తు గడువును ఈ నెల 8 వరకు పొడిగించింది. దీంతో జిల్లా ఎక్సైజ్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేసి గీత కార్మికులు ఎక్కడెక్కడ వున్నారు? వారి పరిస్థితి ఏమిటి? దరఖాస్తులు రాకపోవడానికి కారణాలు ఏమిటని ఆరా తీశారు.దీంతో ప్రతి దుకాణానికి రూ.2లక్షలు చెల్లించి తిరిగి రాని డిపాజిట్‌గా ఉండటంతో ఆర్థిక స్థోమత అంతగా లేని వారు ఆసక్తి కనపరచలేదు. గడువు పెంచి అధికారులు తీసుకున్న కొన్ని నిర్ణయాలతో ప్రస్తుతం జిల్లాలోని 23 గీత కార్మికుల మద్యం దుకాణాలకు దాదాపు 185 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో తిరుపతి రూరల్ మండలంలోని ఈడిగ సామాజిక వర్గం నుంచి అత్యధికంగా 30 దరఖాస్తులు వచ్చాయి. ఇక తిరుపతి కార్పొరేషన్ పరిధిలో ఈడిగ సామాజిక వర్గం నుంచి 25, తడ నుంచి 17, ఓజిలి నుంచి 11, వరదయ్యపాలెం మండలం నుంచి 8, శ్రీకాళహస్తి నుంచి 4, వెంకటగిరి నుంచి 5, గూడూరు నుంచి 6, తొట్టంబేడు నుంచి 4, కేవీబీ పురం నుంచి 9, ఎర్రావారిపాలెం 5, డక్కిలి 1, నారాయణవనం నుంచి 5, శ్రీకాళహస్తి రూరల్ నుంచి3, బాలయ్యపల్లి 4దరఖాస్తులు వచ్చా యి. ఇక గౌడ సామాజిక వర్గానికి సంబంధించి పుత్తూరు మున్సిపాలిటీ నుంచి13, నాయుడుపేట మున్సిపాలిటీ9, గౌండ్ల సామాజిక వర్గానికిగాను సూళ్ళూరుపేట నుంచి ఒకటి, పెళ్ళకూరు 3, వాకాడు 2 వచ్చాయి. గౌడ్ సామాజికవర్గంలో చిట్టమూత్తూరు నుంచి 11, నాగలాపురం 5, దొరవారిసత్రం 4 దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటినీ పరిశీలించి అర్హత కలిగి, ప్రభుత్వ నిబంధనల మేరకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు లాటరీ పద్ధతి ద్వారా దుకాణాలు కేటాయిస్తారని జిల్లా ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి చెప్పారు.

ముగిసిన పుస్తక ప్రదర్శన



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో పది రోజులుగా నిర్వహించిన పుస్తక ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. భారతీయ విద్యా భవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనకు పలు రాష్ట్రాల నుంచి 70స్టాళ్లు వచ్చాయి. నగరవాసులతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచీ పుస్తక అభిమానులు ప్రదర్శనకు వచ్చారు. పుస్తకాలను కొనుగోలు చేశారు.



అలరించిన నృత్య ప్రదర్శన

తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో చెన్నైకు చెందిన బాబాంజలి నృత్యాలయ సంస్థ కళాకారులు ఆదివారం ప్రదర్శించిన నృత్యరూపకం అలరించింది. కళాకారులు రాజ్ పరేష్ బాబా, అభిరామి, అంగయ్యార్ కన్ని, కమలి, గర్విత, తేజశ్రీ, జీవిత, ప్రియదర్శి, విష్ణువి తదితరులు పుష్పాంజలి, దశవతారం, అనమయ్య కీర్తనలు, నారాయణ నీ నామమే గతి, ఇదిగో భద్రాద్రి వంటి కీర్తనలకు జానపద నృత్య ప్రదర్శన చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర మంత్రి సవిత సుప్రభాతసేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రభుత్వ విప్ సుబ్బరాజు ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.




మంత్రి సవిత - సుబ్బరాజు

శ్రీహరి సర్వదర్శనానికి 18 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు నిండిపోయి క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శుక్రవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.46 కోట్లు

శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 76,598

తలనీలాలు సమర్పించినవారు: 35,334





మహిళా యూనివర్సిటీలో క్రీడామణిహారం

సిద్ధమైన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం

ఒకే వేదికలో ఐదు క్రీడాంశాలకు అవకాశం

తిరుపతి(క్రీడలు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్శిటీలో క్రీడోత్సాహం వెల్లివిరియనుంది. వర్సిటీలో మహిళా క్రీడాకారులను మరింత పోత్సాహించేందుకు అధునాతన మైదానం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. ప్రశాంత వాతారణంలో మల్టీపర్పస్ స్టేడియం ఏర్పాటుకు ఖేలో ఇండియా కింద కేంద్రం రూ. 4.5కోట్లు మంజూరు చేసింది. వర్సిటీ గ్రాంట్ కమిషన్ ద్వారా మరో రూ.1.25కోట్లు వెచ్చించింది. 2022లో పోలీసు హౌసింగ్ బోర్డు ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ స్టేడియం నిర్మాణ పనులను ప్రారంభించింది. కాస్త ఆలస్యమైనా అధునాతన హంగులతో స్టేడియం రూపుదిద్దుకుంది. క్రీడాకారులకు అవసరమైన అన్ని వసతులనూ సమకూర్చింది. ఈ వారంతంలోనే రంగుల పనులను కూడా పూర్తి చేయనున్నా న్నారు. స్టేడియం అందుబాటులో వస్తే ఒకే వేదికలో ఐదు క్రీడాంశాలను నిర్వహించవచ్చు. శాప్‌చైర్మన్ రవినాయుడు స్టేడియం ప్రారంభోత్సవ ఏర్పాట్లపై దృష్టిసారించినట్లు సమాచారం.



నేడే సాయ్ ప్రతినిధులు రాక

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) బెంగళూరు రీజనల్ సెంటర్ నుంచి నరేష్, హరీష్ సోమవారం తిరుపతి రానున్నారు. ఈ మేరకు వారి పర్యటన ఖరారైంది. కర్నూలులోని ఖేలో ఇండియా సెంటర్‌ను తిరుపతికి మార్చాలని రాష్ట్రప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో తిరుపతిలోని మైదానాల్లో వసతులు, మౌలిక సదుపాయాలు ఏ స్థాయిలో ఉన్నాయి, మైదానాల స్థితిగతులు, వసతి, డైనింగ్ హాళ్లను తనిఖీ చేయనున్నారు. ఎస్వీయూలోని డార్మెటరీ, ఇతర ఆటస్థలాలు, ఫుట్‌బాల్ గ్రౌండ్, తారకరామ మైదానం, హ్యాండ్‌బాల్, ఇండోర్ స్టేడియంలో తైక్వాండో వంటి క్రీడాంశాల వేదికలను సందర్శించనున్నారు. ఇప్పటి వరకు కర్నూలు, ఏలూరు, వైజాగ్, యానాంలలో సాయ్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్లు ఉన్నాయి. దీంతో సంబంధిత ప్రతినిధులు తిరుపతిలో సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నారు. అలాగే, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఖేలో ఇండియా మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను సందర్శించనున్నారు.



ఐదు క్రీడాంశాలకు ఆవకాశం

వర్సిటీ వెనుకభాగంలో సువిశాల ప్రాంగణంలో రెండంతస్తులతో నిర్మించిన స్టేడియంలో ఉడెన్ షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు, వాలీబాల్ కోర్టు, యోగా, టేబుల్‌టెన్నిస్, జిమ్‌హాళ్లు వేర్వేరుగా ఉన్నాయి.పురుషులు, మహిళలకు వేర్వేరుగా విశ్రాంతి,డ్రెస్సింగ్ గదులతోపాటు లిఫ్టు సదుపాయం కూడా కల్పించారు.ముఖద్వా ర పైభాగంలో వివిధ ఆటగాళ్ల ప్రతిరూపాలు ఆకట్టుకుంటున్నాయి.

గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయండి

భాకరాపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణంలో రోడ్డు సౌకర్యం కోల్పోతున్న గ్రామాలకు రోడ్డు ఏర్పాటు చేయాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. తిరుపతి-మదనపల్లె రహదారి విస్తరణలో భాగంగా తమ గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకుండా పోతోందని చిన్నగొట్టిగల్లు మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు గతంలో విన్నవించారు. స్పందించిన ఆయన ఆదివారం చిన్నగొట్టిగల్లులోని మసీదు వీధి నుంచి కుమ్మరపల్లె రోడ్డును 'మెగా' సంస్థ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. తిప్పిరెడ్డిగారిపల్లె, జంగావాండ్లపల్లె పంచాయతీల్లోని 15 గ్రామాల ప్రజలు చిన్నగొట్టిగల్లుకు రావాలంటే ప్రస్తుతం వస్తున్న రోడ్డు నుంచి సుమారు మూడు కిలోమీటర్లు దూరం వెళ్లి తిరిగి రావాల్సి వస్తోందన్నారు. ఈ విషయంపై జాతీయ రహదారి సంస్థ ఉన్నతాధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే సూచన మేరకు 'మెగా' సంస్థ ప్రతినిధులు తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేయడంతో ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెల్లంకొండ మురళి, మదనమోహన, చిట్టెమ్మ, వైస్ ఎంపీపీ సునీత, మోహన్ రెడ్డి, ఆర్వీ రమణారెడ్డి, ముత్తం ప్రభాకర్, కుమారస్వామి రెడ్డి, సుబ్రహ్మణ్యం, దామోదర్, వెంకతరత్నం, మల్లికార్జునరెడ్డి, చంద్రశేఖర్, వెంకటనాగిరెడ్డి, విజయశేఖర గౌడ్, రమేశ్ రెడ్డి, చోటాసాహెబ్, బెల్లంకొండ రమణ, గురుమూర్తి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



ఎన్‌హెచ్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): సిర్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు. ఆదివారం ఉదయం వేమన విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై 150మంది విద్యార్థులకు రూ.25లక్షలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బ్యాక్ టూ స్కూల్ కార్యక్రమం నడుపుతుండడాన్ని అభినందించారు. డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శోభన్‌బాబు మాట్లాడుతూ కృషితో ఉన్నత స్థితికి చేరుకుని పదిమందికి సాయమందించాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో దాత కొండవీటి విజయలక్ష్మి, సిర్డ్స్ కార్యదర్శి మరుపూరి హేమశేఖర్, స్వాతి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

భాకరాపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని భాకరాపేట ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. చిన్నగొట్టిగల్లు న్యూ కాలనీ సమీపంలోని బహిరంగ ప్రదేశంలో విచ్చలవిడిగా మద్యం తాగి బాటిళ్లు, ప్లాస్టిక్ కవర్లు వేసి ఉండడం గమనించి ఆ ప్రాంతాన్ని ఆదివారం ఆయన శుభ్రం చేయించి, హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

పీఆర్సీ కమిటీని నియమించాలి

పాకాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు జి.ఆంజినేయులు డిమాండు చేశారు. స్థానిక ఎస్వీఎస్ పాఠశాలలో ఆదివారం చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కె.రామయంద్రయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆంజినేయులు మాట్లాడుతూ 11వ పీఆర్సీ గడువు ముగిసి రెండు సంవత్సరాలైనా 12వ పీఆర్సీ కమిటీని నియమించకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి వెంటనే నూతన పీఆర్సీ కమిటీని నియమించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. సమావేశంలో బీటీఏ నాయకులు ఈ రామమూర్తి, ఎస్.ఆదికేశవులు, జ్యోతి ప్రసాద్, కృష్ణమూర్తి, జయబాల, రాజేంద్రుడు, గోపాలయ్య, గణేష్, వెంకటయ్య, శివప్రసాద్, గోపి తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ విద్యతో ఏకాగ్రత పెంపు

- ఎన్ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి -

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అబాకస్ విద్యతో ఏకాగ్రత మరింతగా పెంపొందుతుందని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. ఎమ్మార్‌పల్లె మారుతీనగర్‌కి చెందిన ధరణి అబాకస్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి రాపిడ్ పోటీల అవార్డుల కార్యక్రమాన్ని ఆదివారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్యభవన్‌లో నిర్వహించారు. అతిథులుగా హాజరైన చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, వైఎస్సార్ కడప జిల్లా డిప్యూటీ కలెక్టర్ ఎం.కిరణ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎ.రామానాయుడులతో వీసీ కలసి ప్రతిభచాటిన విద్యార్థులకు అవార్డులు, సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు.వివిధ లెవల్స్‌లో దాదాపు 1,540మంది విద్యార్థులకు పోటీలు నిర్వహించగా 430 మంది అత్యుత్తమ ప్రతిభకనబరచి అవార్డులను అందుకున్నారు. వారు మాట్లాడుతూ గణిత సబ్జెక్టు పట్ల ఆసక్తిని పెంపొందించడంలో అబాకస్ కీలకంగా ఉందని, ప్రాథమిక స్థాయి నుంచి శిక్షణ పొందడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. సంస్థ డైరెక్టర్ ఎం.రవికుమార్, ఎడిఫై పాఠశాల డైరెక్టర్ ప్రణీత్, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు వి.భాస్కర్‌రెడ్డి, ఎం.ప్రభాకర్, ఆర్.శేషాద్రి, పి.వెంకటేశ్‌బాబు, కౌటిల్య సంస్థ డైరెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

● పేపరు..పెన్నులేకుండానే జవాబులు: విద్యార్థులు పేపరు..పెన్ను లేకుండా గణిత అంకెలు, సంఖ్యలను నోటితో గుణించి క్షణకాలవ్యవధిలో సమాధానాలు చెప్పి అబ్బురపరిచారు. విద్యార్థుల మేధోశక్తిని పలువురు అభినందించారు.



బహుమతులు అందజేస్తున్న వీసీ కృష్ణమూర్తి, పక్కనే రవికుమార్

అన్నదమ్ముల వివాదంలో తలదూర్చి హతమయ్యాడు



పాపయ్యనాయుడు (ఫైల్ ఫొటో)

చంద్రగిరి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల ఆర్థిక, ఆస్తుల వివాదంలో తలదూర్చి హత్యకు గురైన ఘటన చంద్రగిరిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలం జక్కదొన గ్రామానికి చెందిన పాపాయ్యనాయుడు(50) పాకాలలో ఐదేళ్లు కాపురమున్నాడు. ప్రస్తుతం చంద్రగిరి రామచంద్రనగర్‌లో ఐదేళ్లకుపైగా ఉంటున్నాడు. పూతలపట్టు మండలం మోటకమ్మపల్లెకు చెందిన అన్నదమ్ములు రాజేష్, హరినాయుడులకు కొన్ని రోజులుగా ఆర్థిక, ఆస్తుల వివాదం జరుగుతోంది. సమీప బంధువైన పాపాయ్యనాయుడు రాజేష్‌కు అండగా నిలిచాడు. ఈ నెల 6వ తేదీన హరినాయుడు చంద్రగిరిలోని పాపయ్యనాయుడు ఇంటికి వచ్చి అతనిపై దాడి చేశాడు. పాపయ్యనాయుడు అపస్మాకరస్థితిలోకి వెళ్లడంతో స్థానికులు పక్క వీధిలో ఉంటున్న పాపయ్యనాయుడు కుమారుడు హరీష్‌కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం ఉదయం హరీష్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. పాపయ్యనాయుడిపై ఇదివరకే పలు పోలీస్‌స్టేషన్‌లలో 25 చోరీ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రెచ్చిపోతున్న గంజాయి, మద్యం బ్యాచ్‌లు

- కృష్ణాపురం ఠానా, తిలక్ రోడ్డులో యువకుల ఘర్షణ
- హడలిపోయిన జనం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మందుబాబులు, గంజాయి బ్యాచ్‌లు రెచ్చిపోతున్నాయి. ఆదివారం సాయంత్రం 6.20 గంటల ప్రాంతంలో కృష్ణాపురం ఠాణా వద్ద వీరంగం సృష్టించారు. నడిరోడ్డుపై ద్విచక్ర వాహనాలు ఆపి, ఒకరినొకరు తోసుకుంటూ వాహనదారులు, పాదచారులతో రచ్చకు దిగారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కాగా, తిలక్ రోడ్డులోని కరుమారియమ్మ గుడి సమీపంలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. ఒక యువకుడు మద్యం తాగి రోడ్డుపై వచ్చే ఆటోలు, వాహనాలను ఆపుతూ గొడవకు వెళ్లాడు.

రాయలచెరువులో పడి యువకుడి మృతి



లోకేష్(పాతచిత్రం)

రామచంద్రాపురం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి-నెత్తకుప్పం ప్రధాన రహదారి మూలకోన క్రాస్ వద్ద స్కూటర్ అదుపు తప్పి రాయలచెరువులో పడి యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్ఐ రామాంజనేయులు కథనం మేరకు.. రాయలచెరువుపేట గ్రామానికి చెందిన లోకేష్(25) మండలంలోని ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని స్నేహితుడైన లీలా కృష్ణను బైక్‌పై ఎక్కించుకుని నెత్తకుప్పంలో వదిలి తిరుగు పయనం అయ్యాడు. స్కూటర్ అదుపు తప్పడంతో రాయలచెరువులో పడి మృతి చెందాడు. ఎంతకీ లోకేష్ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికి ఆర్‌సీపురం పోసులకు ఫిర్యాదు చేశారు ఎస్ఐ రామాంజనేయులు లోకేష్ సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా రాయలచెరువులో వెతకగా లోకేష్ మృతదేహం దొరికింది. వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఎస్ఐ రామాంజనేయులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. లోకేష్‌కు భార్య, కుమారుడు ఉన్నారు.

వేడుకగా మల్లాలమ్మ జాతర

అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే నాని



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపాలెం వద్ద తిరుపతి నగర మేదర(మహేంద్ర) సంఘం ఆధ్వర్యంలో మల్లాలమ్మ జాతరను అత్యంత వేడుకగా నిర్వహించారు. అమ్మవారిని కొలువుదీర్చి గణపతిపూజ, గంప అలంకరణ, గంప ఊరేగింపు, గంప పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సామూహిక వన భోజనాలు నిర్వహించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మేదర సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేదర సంఘం నాయకులు తాలే రాజశేఖర్, తమ్మినేని నాగరాజు, తిరుపతి శ్రీనివాసులు తుమ్మల చలపతి పాల్గొన్నారు.

మిట్టపాలెంలో రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్

చంద్రగిరి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపాలెం శ్రీనివాస హోటల్లో ఆదివారం నవయుగ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి 102 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఓపెన్ క్యాటగిరిలో స్వర్ణ నిహాల్(6.5-7), అభిషేక్(6-7), పి.హరిరామసాయికృష్ణ(6-7), బడవత్ ఆనంద(6-7), డబ్ల్యూసీఎం బిల్వ నిలయ ఈశ్వర కృష్ణ(6-7) పాయింట్లతో విజేతలుగా నిలిచారు. అభినందన సభలో నవయుగ కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు బాల్యం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచాలని కోరారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులతోపాటు మెడల్స్ అందజేశారు. టోర్నమెంట్ డైరెక్టర్ అజీజ్, ఆంధ్రా చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ దివాకర్‌రెడ్డి, తిరుపతి చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మల్లికార్జున పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

ముస్సోరికి కమిషనర్ మౌర్య

- ఇన్‌చార్జి కమిషనర్‌గా చరణ్ తేజ్ రెడ్డి

తిరుపతి, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి) : ఉత్తరాఖండ్‌లోని ముస్సోరిలో ఈ నెల 10నుండి 14వతేదీ వరకు జరగనున్న మునిసిపల్ గవర్నెన్స్ ఫర్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ సర్వీస్ ట్రైనింగ్ కోసం తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం వెళ్లారు. ఈ ఐదు రోజుల పాటు కార్యాలయ కార్యక్రమాలకు అంతరాయం లేకుండా అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు.

వెంకటేశ్వర్లుకు పీజీ, పీహెచ్‌డీ అడ్మిషన్ల బాధ్యత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఓఆర్ఐ విభాగ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లుకు రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీజీ, పీహెచ్‌డీ అడ్మిషన్ల బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది.

మంటలు అంటుకుని గాయపడిన మహిళ మృతి

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కేటీరోడ్డులోని ఓ అపార్టుమెంటులో వారం కిందట మంటలు అంటుకొని.. చికిత్స పొందుతున్న ఎంఎం శాంత షీలా (50) ఆదివారం మృతిచెందారు. అలిపిరి ఎస్ఐ లోకేశ్‌బాబు తెలిపిన ప్రకారం.. ఈనెల ఒకటో తేది ఉదయం 11 గంటలకు వంట చేయడానికి శాంతషీలా గ్యాస్ స్టవ్ వెలిగించే క్రమంలో మంటలు అంటుకుని గాయపడింది. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది.

చెరువులో పడి దోర్నకంబాల వాసి మృతి

వెదురుకుప్పం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జల్లికట్టు వెళ్లొస్తూ.. చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రగిరి మండలం దోర్నకంబాలకు చెందిన శ్రీనాథరెడ్డి(39) తన స్నేహితులతో కలసి ఆదివారం వెదురుకుప్పం మండలం పాతగుంటలో జరిగిన జల్లికట్టుకు హాజరయ్యాడు. పూటుగా మద్యం తాగి మధ్యాహ్నం మూడు గంటలపైన తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో ఇద్దరు స్నేహితులతో కలిసి బ్రాహ్మణపల్లె సమీపంలో ఉన్న ఓ చెరువు వద్దకు వెళ్లాడు. అక్కడ ఏం జరిగిందో ఏమో చెరువులో పడి గల్లంతయ్యాడని ఊరంతా తెలిసింది. వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య అగ్నిమాపక కేంద్ర సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారొచ్చి సుమారు రాత్రి 8గంటల సమయంలో శ్రీనాథరెడ్డి మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా సాకిరేవు దేవర మహోత్సవం



అతిథులను సన్మానిస్తున్న రజక సంఘం నేత సుధాకర్

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జీవకోన రాజీవ్‌గాంధీకాలనీలో రజక సంఘ నేత సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం జీవలింగేశ్వర రజక సంఘం దోబీఘాట్ వద్ద సాకిరేవు దేవర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. దోబీఘాట్ అభివృద్ధికి సహకరించాలని రజకులు కోరారు. రాజీవ్‌గాంధీకాలనీ మొదటి లైన్ వద్ద పెద్దకాలువకు పైకప్పు ఏర్పాటు చేయాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు. విశిష్ట అతిథులు నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, రజక కార్పొరేషన్ డైరెక్టర్లు మధు, కరాటే చంద్రలను సన్మానించారు. కార్పొరేటర్లు అన్నా అనిత, అన్నా సంధ్య, నాయకులు అన్నా రామచంద్రయ్య, అక్కినపల్లె లక్ష్మయ్య, మల్లెల నాగరాజు, శ్రీరాములు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న పులివర్తి సుధారెడ్డి

పాకాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి కోరారు. మండలంలోని తలారిపల్లె, చెన్నుగారిపల్లె, సామిరెడ్డిపల్లెలలో ఆదివారం ఆమె మహిళలతో సమావేశాలు నిర్వహించారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,రాయితీ రుణాల గురించి వివరించారు.ఆసక్తిగల మహిళలు ఆలోచనలతో వస్తే ఆచరణలో పెట్టడానికి సహకరిస్తామన్నారు.కార్యక్రమంలో జడ్పీటీసీ నంగా పద్మజ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజ నాయుడు,కార్యదర్శి ఫల్గుణ, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కె.సావిత్రి, సర్పంచ్ వసంత, ఎంపీటీసీ రాజ్యలక్ష్మి, నాయకులు బి.ఈశ్వ రచౌదరి, టిజె.ప్రవీణ్, ఎస్.ఉమాపతినాయుడు పాల్గొన్నారు.

శాకాహారం పట్ల అవగాహన అవసరం

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): శాకాహారం పట్ల మరింత అవగాహన అవసరమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. అహింసా ధ్యాన మహోత్సవంలో భాగంగా తిరుపతి స్పిర్చువల్ సొసైటీ మెగా శాకాహార ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయులు, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, ప్రైవేట్‌కు అప్పగించాలని రాష్ట్ర మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జేఏసీ నాయకులు చినబాబు, జయచంద్ర, నాగవెంకటేష్‌లు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీని ఆయన నివాసం వద్ద కలిసి విన్నవించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీల భర్తీకి సీఎంతో చర్చించాలని కోరారు. నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. తాత్కాలిక నియామకాలను ఆంధ్రప్రదేశ్ కార్పొరేట్ అవుట్ సోర్సింగ్ సంస్థ ద్వారా నియమించాలని కోరారు.

12న పౌర్ణమి గరుడసేవ

తిరుమల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 12వ తేదీన పౌర్ణమిగరుడసేవ జరుగనుంది. ప్రతినెలా పౌర్ణమి రోజున టీటీడీ గరుడసేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బుధవారం రాత్రి 7 నుంచి 9 గంటల మధ్యలో సర్వాలంకార భూషితుడైన మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడునిపై కొలువుదీరి నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ప్లాస్టిక్ రహిత తిరుపతే లక్ష్యం

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిని ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చడమే లక్ష్యమని స్టూడెంట్ నేషన్ టీం అధ్యక్షురాలు హర్షిణి తెలిపారు. స్టూడెండ్ నేషన్ టీం ఆధ్వర్యంలో శని, ఆదివారాలలో ప్లాస్టిక్ ఫ్రీ నేషన్‌పై వెంకటరమణ లే అవుట్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టూడెంట్ నేషన్ టీం అధ్యక్షురాలు హర్షిణి, కార్యదర్శి విక్రమ్, సభ్యులు ప్రణవ్ పాల్గొన్నారు.

తుడా క్వార్టర్స్‌లో చోరీ

● నగలు, నగదు అపహరణ

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మంగళం తుడా క్వార్టర్స్‌లో జరిగిన చోరీ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. తిరుచానూరు పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ జగన్నాథం వివరాల మేరకు... స్విమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎ.ఆర్.నరేంద్ర బాబు తుడా క్వార్టర్స్‌లోని హౌస్ నెంబరు 81లో నివాసముంటున్నారు. భార్య అనారోగ్యంతో బాధపడుతుండగా ఐదో తేదీ ఉదయం స్విమ్స్‌కు తీసుకెళ్లారు. చిత్తూరులో చదువుకుంటున్న కుమారుడు రేవంత్ తల్లిని చూసేందుకు శనివారం ఆస్పత్రికి వచ్చాడు.రాత్రి తుడా క్వార్టర్స్‌లోని ఇంటి వద్దకు చేరుకున్నాడు. తలుపులు, బీరువా, ఇతర లాకర్లు తెరిచి ఉండడంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని తండ్రికి విషయం చెప్పాడు. ఆదివారం ఉదయం తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ జగన్నాథం తన బృందంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశానాల అభివృద్ధికి చర్యలు

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి 9 (ఆంధ్ర జ్యోతి): నగర పరిధి లోని జీవకోన, రాజీవ్‌గాంధీకాలనీ వద్ద ఉన్న శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా కార్యక్రమంలో భాగంగా జీవకోన ప్రజలు ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసు కొచ్చారు. ఆదివారం రాజీవ్‌గాంధీ కాలనీలో ఓ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శ్మశాన వాటికలను పరిశీలించారు. ప్రహరీలు నిర్మించి, గేట్లు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ అన్నా అనిత, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మలు ఎమ్మెల్యేను కోరారు. నాయకులు అన్నా రామచంద్రయ్య, టీడీపీ నగర అధ్యక్షుడు వట్టికుంట చినబాబు, రజక సంఘం నేత సుధాకర్, మహ్మద్‌రఫీ పాల్గొన్నారు.

వెటర్నరీ విద్యార్థుల రక్తదానం

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా ఉపకార వేతనం(స్టైఫండ్) పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె ఏడవ రోజైన ఆదివారమూ కొనసాగింది. వర్సిటీ ప్రధాన గేటు వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో 30మంది విద్యార్థులు రక్తదానం చేశారు. స్టైఫండ్ పెంచే వరకు సమ్మె కొనసాగిస్తామని, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు.

గాయకులకు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి, చంద్రగిరిలకు చెందిన జంట గాయకులు డాక్టర్ కడివేటి మునిరత్నం(విశ్రాంత ఉద్యోగి), డాక్టర్ కమతం రెడ్డి(ప్రస్తుత ప్రభుత్వ ఉద్యోగి) కళారంగంలో అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి హైదారాబాదుకు చెందిన తెలుగు కళారత్నాలు జాతీయ సాంస్కృతిక సంస్థ ఏపీజే అబ్దుల్‌కలాం లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం చేసింది. ఆదివారం హైదరాబాదులోని త్యాగరాయ గానసభా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ అధినేత డాక్టర్ యూవీ రత్నం వారికి అవార్డుతో పాటు బంగారు నందులను బహూకరించి సన్మానించారు.

నగరాభివృద్ధికి కృషి చేస్తా



మునికృష్ణను సన్మానిస్తున్న సామంచి శ్రీనివాసులు తదితరులు

తిరుపతి, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి) : కూటమి పార్టీల ప్రతినిధిగా నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఆర్‌సీ మునికృష్ణను బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ఘనంగా సత్కరించి, అభినందించారు. మునికృష్ణ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, నగరపాలక సంస్థ పరిధిలో మెరుగైన సౌకర్యాలను అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. సామంచి మాట్లాడుతూ కూటమి పాలనలో తిరుపతి నగరంలో అభివృద్ధితో పాటు ప్రజలకు సంక్షేమం, ప్రశాంతమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అమలు చేస్తున్న పథకాలు, వాటి ఫలితాలను ప్రజలందరికీ చేరేలా మూడు పార్టీలు కలిసి కృషి చేయాలని, అందుకు డిప్యూటీ మేయర్ చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అజయ్ కుమార్, భవాని శంకర్, హేమ కిరణ్, పార్థు, సేతు మాధవ్, ప్రసాద్, శంకర్ యాదవ్, రెడ్డి బాబు పాల్గొన్నారు. అదేవిధంగా మునికృష్ణను ఎడిఫై స్కూల్ అధినేత ప్రణీత్, ఆకుల సతీష్, జేడబ్ల్యు విజయకుమార్, కందాటి మిథున్ రెడ్డి, ఆర్కాట్ కృష్ణప్రసాద్, వెంకటరెడ్డి ఘనంగా సత్కరించారు.

నేడు డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్

తిరుపతి, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9.30నుంచి 10.30 గంటల వరకు 0877-2227208కు ఫోన్ చేసి ఫిర్యాదుచేయవచ్చని తెలియజేశారు. అదేవిధంగా అర్జీలు, ఫిర్యాదులు ఇచ్చే వారు 10.30 నుంచి ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

'సీపీఆర్ మంగళ' అపార్ట్‌మెంట్

ప్రీ బుకింగ్ ప్రారంభం



సీపీఆర్ అపార్టుమెంట్ ప్రీ బుకింగ్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్లు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మంగళం పరిధిలో అధునాతనంగా నిర్మించిన 'సీపీఆర్ మంగళ' 2బీకే అపార్టుమెంట్ ప్రీ బుకింగ్‌ను ఎండీ కేవీ చలపతి ఆదివారం ప్రారంభించారు. కరకంబాడి రోడ్డులోని ఎంఆర్ఎఫ్ షోరూం ఎదురుగా సీపీఆర్ అపార్టుమెంట్ ప్రత్యేక ఆకర్షణీయంగా నిలుస్తోందన్నారు. ప్రీమియం లోకేషన్, మోడర్న్ డిజైన్, ఆర్కిటెక్చర్, సెక్యూరిటీ, సేఫ్టీ, పార్కింగ్, క్లబ్‌హౌస్, పార్కు, పాఠశాలలు, హాస్పిటల్స్, షాపింగ్‌మాల్స్‌కు అత్యంత సమీపంలో ఉందని వివరించారు. ఆరంభ ధర రూ.37లక్షలుగా నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు 9492013322/66/88 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ ప్రారంభోత్సవంలో డైరెక్టర్లు కాశీ, లోకేష్, వినోద్ పాల్గొన్నారు.

ఎఫ్ఆర్‌వోల అసోసియేషన్

తిరుపతి సర్కిల్ అధ్యక్షుడిగా దొరస్వామి

మంగళం, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అటవీ క్షేత్రాధికారుల (ఎఫ్ఆర్‌వోలు) అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల సమావేశం ఆదివారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని బయోట్రిమ్‌లో నిర్వహించారు. తిరుపతి సర్కిల్ అధ్యక్ష, కోశాధికారి పోస్టులకు ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా దొరస్వామి, కోశాధికారిగా బి.ప్రియాంకలను ఎన్నుకున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.లక్ష్మీపతి, తిరుపతి సర్కిల్ కమిటీ ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులు బి.రామానాయక్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

రచయితకు సన్మానం



తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మంగళం డిపో ఆర్టీసీ ఉద్యోగి, రచయిత గుండ్లూరు సుబ్రహ్మణ్యంను ఆదివారం వైఎస్సార్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కడప శంకర్రావుపేటలో జరిగిన ఐఎంఏ వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో రాయలసీమ భాగస్వామ్యం అనే కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం పాల్గొని రాయలసీమ పూర్వ, ప్రస్తుత వైభవం గురించి కవితాగానం చేసి శ్రోతలను అలరించారు. ప్రముఖ రంగస్థల నటుడు కాసింఖాన్, సినీ నిర్మాత బాబుల్‌రెడ్డి, వైఎస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, జింకా సుబ్రహ్మణ్యంలు ఆయన్ను సత్కరించారు.

పుస్తకంపై దాడిని సహించం

సాహిత్య, ప్రజా సంఘాల నేతల స్పష్టీకరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి పుస్తక ప్రదర్శనలో కొన్ని స్టాళ్లపై దాడి చేయడాన్ని పలు సాహిత్య, ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాలు ఖండించాయి. అభ్యుదయ వేదిక ఆధ్వర్యంలో తిరుపతి బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పుస్తకంపై దాడి చేయడం మంచి పద్ధతి కాదని పలువురు హితవు పలికారు.

పుస్తకాలపై ఉన్మాదం చూపడం తగదు



పుస్తకాలపై ఉన్మాదం చూపడం సరైన పద్ధతి కాదు, ఇది ఉన్మాద ప్రారంభ దశ అనిపిస్తోంది. దీన్ని బట్టి దేశంలో ఉన్మాదం పెరుగుతోందని అర్థం చేసుకోవాలి. ఏం తినాలో, ఏం చదవాలో ఎవరో నిర్ణయించడం అభ్యంతరకరం. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం.

- పెనుగొండ లక్ష్మీనారాయణ, అరసం జాతీయ అధ్యక్షుడు

ఆలోచనలను నిషేధించలేం



ఏ ఆలోచననూ నిషేధించలేం. ఇలా నిషేధిస్తూ పోతే మానవ సమాజం ముందుకు పోదు. విజయవాడలో గుండాలకు వ్యతిరేకంగా చంద్ర రాజేశ్వరరావు కర్ర బట్టుకొని నిలబడబట్టే వాళ్ల తోక ముడిచారు. తిరుపతిలోనూ ఇలాంటి ఉన్మాదులకు వ్యతిరేకంగా వీధి పోరాటాలకు దిగాల్సి ఉంటుంది.

- రాఘవశర్మ, రచయిత

అన్ని భావాలకు విలువ ఇవ్వాలి



పుస్తక ప్రదర్శనలో అన్ని భావాలకు విలువ ఇచ్చేలా ఉండాలి. ఒకే విధమైన పుస్తకాలు అమ్మాలనే ధోరణి మంచిది కాదు. సంకుచితంగా ఆలోచిస్తే పుస్తక ప్రదర్శనకే అర్థం లేదు. అన్ని రకాల పుస్తకాలు విక్రయించే స్వేచ్ఛ ఇవ్వాలి.

- రామానాయుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

రచయిత గొంతు నొక్కడమే



ఇటువంటి చర్యలు రచయితల గొంతు నొక్కినట్టుగా అర్థం చేసుకోవాలి. అన్ని భావాలు అర్థం చేసుకుంటేనే సత్యాన్ని ఆవిష్కరించగలం. పాసిజం, సంఘర్షణ నుంచే అగ్ని పుడుతుందని చెంఘిజ్ ఖాన్ అన్నారు. ఇలాంటి దాడులు సృజనకారులకు అవరోధం. సత్యం చెప్పడానికి భయపడే పరిస్థితి ఏ కాలంలోనూ, ఏ సమాజంలోనూ ఉండకూడదు.

- ఆచార్య మధురాంతకం నరేంద్ర, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

బెదిరింపులకు తలొగ్గం



ఇలాంటి బెదిరింపులకు బెదరం. కుల, మత ఘర్షణలకు తిరుపతిలో తావివ్వకూడదు. పుస్తకాలు మనుషుల్లోని అజ్ఞానాన్ని తొలిగిస్తాయి. ఇటువంటి పుస్తకాల అమ్మకాలను అడ్డుకోవడం మంచి పద్ధతి కాదు. దీన్ని అందరూ ఐక్యంగా తిప్పికొట్టాలి. - అంజయ్య, ఆర్పీఐ అధ్యక్షుడు

డేంజర్ జోన్‌లోకి తిరుపతి



ఇలాంటి దాడులకు ప్రతిదాడులే సరైన సమాధానం. ఇటీవల యూనివర్సిటీ ప్రొఫెసర్‌పై దాడి చేశారు. ఇప్పుడు బుక్ ఫెయిర్‌పై దాడి. రేపు ఇంకా ఎలాంటి దాడులు చేస్తారో?. వీరిని ఇలాగే వదిలేస్తే ఇళ్ల దగ్గరకు కూడా వస్తారు.

- కందారపు మురళి, సీఐటీయూ నేత

సామరస్యత అవసరం



కుల, మత సామరస్యం అవసరం. భిన్న భావాలను గౌరవించే సంస్కృతి పెరగాలి. ఇది పుస్తకాలతోనే సాధ్యం. అలాంటిది పుస్తకాలపైనే దాడి చేయడం అనాగరికం. మనం వినియోగించుకుంటున్న టీవీలు, ఫోన్లు, కంప్యూటర్లు ఏ కులం, మతం వారో కనిపెట్టారో తెలుసుకునే వినియోగిస్తున్నామా? నచ్చిన పుస్తకం కొనచ్చు. నచ్చని పుస్తకాన్ని వదిలేయవచ్చు. అంతే కానీ ఫలానా పుస్తకమే అమ్మాలి, మిగతా పుస్తకాలు అమ్మకూడదని చెప్పడం మంచి పద్ధతి కాదు. - సాకం నాగరాజ, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు

తీర్మానాలు

- పుస్తక ప్రదర్శనపై దాడి ఘటనపై ఎస్పీకి ఫిర్యాదు చేయడం.
- 11వ తేదీ తిరుపతిలో పెరియార్ పుస్తకాల ప్రదర్శన చేయడం.

పుస్తక పఠనంతో మంచి ఆలోచనలు

ముగిసిన 17వ తిరుపతి పుస్తక ప్రదర్శన - పది రోజుల పాటు 70 స్టాళ్ళలో పుస్తక అమ్మకాలు - ఘనంగా సమాపనోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు చదవడం ద్వారా మంచి ఆలోచనలు కలుగుతాయని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ తెలియజేశారు. పది రోజులుగా తిరుపతిలో నిర్వహించిన 17వ తిరుపతి పుస్తక ప్రదర్శన ముగిసింది. ఇస్కాన్ టెంపుల్ వద్దనున్న గ్రౌండ్‌లో చేపట్టిన ఈ పుస్తక ప్రదర్శనకు మంచి స్పందన వచ్చింది. భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనకు పలు రాష్ట్రాల నుంచి 70 స్టాళ్లు వచ్చాయి. భారతీయ విద్యా భవన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు అధ్యక్షతన ఆదివారం సాయంత్రం సమాపనోత్సవం నిర్వహించారు. కర్ణాటకలోని దేవరాజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ అండ్ రీసెర్చ్ సంస్థ వీసీ డాక్టర్ వెంగమ్మ మాట్లాడుతూ పుస్తక విజ్ఞానాన్ని కొత్త తరానికి అందించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి సుకృతానంద మాట్లాడుతూ తిరుపతిలో పుస్తక ప్రదర్శన సంప్రదాయాన్ని నిరంతరం కొనసాగించాలని కోరారు. ఐజర్ డైరెక్టర్ సంతను భట్టాచార్య మాట్లాడుతూ పుస్తకాల్లో ప్రపంచ విజ్ఞానం ఉందని, ప్రాపంచిక విజ్ఞానాన్ని తెలుసుకోవడం అవసరమని అన్నారు. సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ గొప్ప పుస్తకాలు గొప్ప సమాజాన్ని నిర్మిస్తాయన్నారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ మాట్లాడుతూ పుస్తకం పఠనం దినచర్యలో భాగం కావాలన్నారు. భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ సత్యనారాయణరాజు మాట్లాడుతూ నగర వాసులే కాకుండా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచీ పుస్తక అభిమానులు రావడం విశేషమన్నారు. పుస్తక ప్రదర్శన విజయవంతానికి తోడ్పడిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అభ్యుదయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటరమణ, జిల్లా నాయకులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ జనార్దన్, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

సూర్యఘర్ పథకం అవగాహన మేళాకు విశేష స్పందన

తిరుపతి(ఆటోనగర్) ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఆదా చేయడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూర్యఘర్ పథకంపై తిరుపతి ఎస్ఈ కార్యాలయంలో నిర్వహిస్తున్న అవగాహన మేళాకు విశేష స్పందన లభించింది. ఆదివారం సెలవు కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులు హాజరై రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకున్నారు. కిలోవాట్ విద్యుత్ ఉత్పత్తికి నివాసగృహాలపై 100 చదరపు అడుగుల స్థలంలో ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఈ పి.సురేంద్రనాయుడు వివరించారు. ఈ పథకాన్ని వినియోగించుకుంటే సొంత లాభంతోపాటు సంస్థకు కూడా ఆదాయం చేసిన వారవుతారని తెలిపారు. ఈఈలు, డిఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.



అవగాహన మేళకు హాజరైన వినియోగదారులు

ఎస్వీయూ విద్యార్థిపై రౌడీషీటర్ దాడి

తిరుపతి (నేర విభాగం), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థిపై రౌడీషీటర్ కత్తితో దాడి చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ సీఐ రామయ్య కథనం మేరకు.. ఎస్వీ యూనివర్సిటీలో వెంకటేష్ ఎంఏ ఎకనమిక్స్ చదువుతున్నాడు. హెచ్-బ్లాక్‌లో ఉంటున్నాడు. వెంకటేష్‌పై మణికంఠ, అతని స్నేహితుడు యోగేశ్వర్ దాడి చేసినట్లు సమాచారం. కారణాలు తెలియాల్సి ఉంది. దాడికి పాల్పడిన ఇద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు విచారిస్తున్నారు.

కష్టపడిన కార్యకర్తలకే పెద్దపీట: పాశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

చిట్టమూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధికారంలోకి వచ్చేందుకు కష్టపడి పనిచేసిన కార్యకర్తలకే పెద్దపీట వేస్తామని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం చిట్టమూరు ప్రభుత్వాస్పత్రిలో అదనపు భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ నిర్ణయాలను ఎవరూ అతిక్రమించకూడదన్నారు. తనతో పాటు ఏ నాయకుడు తప్పు చేసినా కార్యకర్తలు నిలదీయవచ్చన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని 23 పంచాయతీల్లో కూటమి విజయం సాధించేలా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. మండలంలో రూ.3.50 కోట్లతో సిమెంట్ రోడ్ల పనులు చేపట్టామని, అందులో రూ.2కోట్ల పనులు పూర్తి చేశామన్నారు. రూ.39 లక్షలతో చిట్టమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు భవనం నిర్మాణాన్ని ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేలా చూడాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్, డీటీ నిరంజన్ కుమార్, ఆర్అండ్‌బీ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచు కోటయ్య, వైద్యాధికారిణి పద్మావతి, టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు, నాయకులు మస్తాన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



సమావేశంలో సీఐటీయూ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చెంగయ్య అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలను ప్రవేశపెడుతామని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంతో మున్సిపాలిటీల్లో పనిచేసే ఉద్యోగులందరూ తీవ్ర భయాందోళనకు గురవుతున్నారన్నారు. ఆప్కాస్ విధానాన్ని రద్దు చేస్తే మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, శ్రీనివాసులు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి ఎమ్మెల్యే ఆర్థికసాయం



భార్గవికి తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నేతలు శంకరయ్య, మురళీరెడ్డి, తిరుపాల్, వీరయ్య తదితరులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చిన్నారి భార్గవికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. పెళ్లకూరు మండలం కానూరు రాజుపాలెం బండి మహేష్, మనెమ్మ దంపతుల కుమార్తె భార్గవి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆమెన వెంటనే స్పందించారు. వైద్య ఖర్చులకోసం రూ.10 వేలు చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. టీటీడీ పద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రిలో వైద్యం అందేలా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొక్కు శంకరయ్య, తిరుపాల్, వేనాటి మురళీరెడ్డి, తిరుపాల్, కోటపోలూరు సాగునీటి సంఘ అధ్యక్షుడు రమణయ్య, సుధాకర్‌రెడ్డి, వీరయ్య పాల్గొన్నారు.

మహిళా యూనివర్సిటీలో క్రీడామణిహారం

- సిద్ధమైన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం
- ఒకే వేదికలో ఐదు క్రీడాంశాలకు అవకాశం



తిరుపతి(క్రీడలు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో క్రీడోత్సాహం వెల్లివిరియనుంది. వర్సిటీలో మహిళా క్రీడాకారులను మరింత పోత్సాహించేందుకు అధునాతన మైదానం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. ప్రశాంత వాతారణంలో మల్టీపర్పస్ స్టేడియం ఏర్పాటుకు ఖేలో ఇండియా కింద కేంద్రం రూ. 4.5కోట్లు మంజూరు చేసింది. వర్సిటీ గ్రాంట్ కమిషన్ ద్వారా మరో రూ.1.25కోట్లు వెచ్చించింది. 2022లో పోలీసు హౌసింగ్ బోర్డు ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ స్టేడియం నిర్మాణ పనులను ప్రారంభించింది. కాస్త ఆలస్యమైనా అధునాతన హంగులతో స్టేడియం రూపుదిద్దుకుంది. క్రీడాకారులకు అవసరమైన అన్ని వసతులనూ సమకూర్చింది. ఈ వారంతంలోనే రంగుల పనులను కూడా పూర్తి చేయనున్నారు. స్టేడియం అందుబాటులో వస్తే ఒకే వేదికలో ఐదు క్రీడాంశాలను నిర్వహించవచ్చు. శాప్‌ఛైర్మన్ రవినాయుడు స్టేడియం ప్రారంభోత్సవ ఏర్పాట్లపై దృష్టి సారించినట్లు సమాచారం.

ఐదు క్రీడాంశాలకు అవకాశం

వర్సిటీ వెనుకభాగంలో సువిశాల ప్రాంగణంలో రెండంతస్తులతో నిర్మించిన స్టేడియంలో ఉడెన్ షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టులు, యోగా, టేబుల్‌టెన్నిస్, జిమ్‌హాళ్లు వేర్వేరుగా ఉన్నాయి. పురుషులు, మహిళలకు విశ్రాంతి, డ్రెస్సింగ్ గదులతోపాటు లిఫ్టు సదుపాయం కూడా కల్పించారు. ముఖద్వార భాగంలో వివిధ ఆటగాళ్ల ప్రతిరూపాలు ఆకట్టుకుంటున్నాయి.

నేడే సాయ్ ప్రతినిధులు రాక

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) బెంగళూరు రీజనల్ సెంటర్ నుంచి నరేష్, హరీష్ సోమవారం తిరుపతి రానున్నారు. ఈ మేరకు వారి పర్యటన ఖరారైంది. కర్నూలులోని ఖేలో ఇండియా సెంటర్‌ను తిరుపతికి మార్చాలని రాష్ట్రప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో తిరుపతిలోని మైదానాల్లో వసతులు, మౌలిక సదుపాయాలు ఏ స్థాయిలో ఉన్నాయి, మైదానాల స్థితిగతులు, వసతి, డైనింగ్ హాళ్లను తనిఖీ చేయనున్నారు. ఎస్వీయూలోని డార్మెటరీ, ఇతర ఆటస్థలాలు, ఫుట్‌బాల్ గ్రౌండ్, తారకరామ మైదానం, హ్యాండ్‌బాల్, ఇండోర్ స్టేడియంలో తైక్వాండో వంటి క్రీడాంశాల వేదికలను సందర్శించనున్నారు. ఇప్పటి వరకు కర్నూలు, ఏలూరు, వైజాగ్, యానాంలలో సాయ్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్లు ఉన్నాయి. దీంతో సంబంధిత ప్రతినిధులు తిరుపతిలో సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నారు. అలాగే, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఖేలో ఇండియా మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను సందర్శించనున్నారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

దొరవారిసత్రం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం ముచ్చలగుంట గ్రామ శివారులో కోడిపందేల స్థావరంపై ఆదివారం ఎస్‌ఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు జరిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని, రెండు కోళ్లు, రెండు మోటారు సైకిళ్లు, రూ.7800 నగదు స్వాధీన చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

12లోగా రుణాలకు దరఖాస్తు చేసుకోండి

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలు పొందేందుకు ఈనెల 12వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కోటీశ్వరరావు కోరారు.

కోటమ్మకు విశేష పూజలు



కోట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పాలక మండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పెట్టుబడుల మోత.. దిగుబడుల్లో వాత

- ముంచిన వాతావరణ మార్పులు
- మద్దతు ధర లేక నష్టాల్లో రైతులు



చిల్లకూరులో మిషన్‌తో వరి కోతలు

పెళ్లకూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దేశానికి వెన్నుముకగా పిలుచుకునే రైతుల పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ప్రకటనల్లో తప్ప ప్రభుత్వం నుంచి మద్దతు లభించకపోవడంతో రైతులు నష్టాల పాలవుతున్నారు. వ్యయప్రయాసలకు ఓర్చి పండించిన వరిలో ఆశించిన మేరకు దిగుబడులు రాకపోవడంతో పాటు గిట్టుబాటు ధరకు ధాన్యాన్ని విక్రయించుకోలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాస్తవానికి ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం, తెలుగుగంగ జలాలు పుష్కలంగా అందడంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. అయితే పంటలు పండిన తరువాత దిగుబడులు తగ్గిపోవడంతో అన్నదాతల ఆశలు నీరుగారిపోయాయి. ముఖ్యంగా వరి పైరు పొట్ట, వెన్ను దశలో కురిసిన అకాల వర్షాలు, వాతావరణంలో మార్పులతో దిగుబడి గణనీయంగా తగ్గింది. దీనికి తోడు పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతుల కంట కన్నీరు పెట్టిస్తోంది. విత్తనాలు, పురుగుమందులు, కూలీలు ఏటేటా పెరగడంతో పెట్టుబడి పెరిగిపోతూనే ఉంది. ఈ ఏడాది వరి పైరుకు తెగుళ్లు విపరీతంగా సోకడంతో పురుగు మందులు ఎక్కువగా పిచికారీ చేయాల్సివచ్చింది. గతంలో ఎకరాకు 45 కిలోల నుంచి 50 బస్తాలు ధాన్యం దిగుబడి వచ్చేది. ప్రస్తుతం 30నుంచి 35 కిలోలు మాత్రమే దిగుబడి రావడంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

వరి కోతలు ప్రారంభం: మండలంలో 20 రోజుల నుంచి వరి పంట కోతలు జరుగుతున్నాయి. అయితే గిట్టుబాటు ధర లేకపోవడంతో ధాన్యాన్ని తక్కువ ధరకు దళారులకు ధారపోయాల్సి వస్తోందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048 రకాల 75 కేజీల ఏ గ్రేడ్ ధాన్యం బస్తా రూ.1740, బీ గ్రేడ్‌కు రూ.1720 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించగా, ప్రైవేట్ మార్కెట్‌లో రూ.1550 మాత్రమే పలుకుతోంది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



రాజుపాళెం వద్ద జాతీయ రహదారి పక్కన ఆక్రమిత స్థలంలో హోటళ్లు - పాఠశాల పక్కన చదునుచేసిన గ్రామనత్తం భూమి

ఆక్రమణలకు అడ్డేది?

జాతీయ రహదారికి ఇరువైపులా గ్రామనత్తం, పోరంబోకు భూముల కబ్జా

ఓజిలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో జాతీయ రహదారికి ఇరువైపులా గ్రామనత్తం, రెవెన్యూ, పోరంబోకు భూములు కబ్జాకు గురౌతున్నాయి. ప్రధానంగా రాజుపాళెం వద్ద ఆక్రమణలు ఏళ్లగా కొనసాగుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ఇక్కడ లారీలు, ఇతర వాహనాలు నిలిపేందుకు అనువుగా ఉండడంతో జాతీయ రహదారికి ఇరువైపులా హోటళ్లు ఎక్కువగా ఉన్నాయి. దీంతో భూముల విలువ పెరగడంతో ఇరువైపులా ప్రభుత్వ, గ్రామనత్తం, పోరంబోకు స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇటీవల రోడ్డు పక్కన ఉన్న పాఠశాల ప్రహరీని ఆనుకుని ఉన్న గ్రామనత్తం భూమిని సైతం చదునుచేసి నిర్మాణానికి సిద్ధం చేశారు. ఈ విషయాన్ని తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా విచారించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుధాకర్

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో చెన్నకేశవస్వామి ఆలయం వద్ద ఆదివారం నెల్లూరుకు చెందిన సుశీల నేత్రాలయ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ సుధాకర్ కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, శేషు, బాలయ్య, రమణయ్య, వెంకటేశ్వర్లు, చలమయ్య, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెడితే సహించం: కాకాణి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పక్కన వైసీపీ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సానుభూతిపరులపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెడితే సహించేది లేదని ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మంగళపూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరుడు సతీష్‌యాదవ్‌పై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టి వేధించడం మంచిపద్ధతి కాదన్నారు. కార్యకర్తలకు ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మేరిగ మురళీధర్, ఎద్దల నరేంద్రరెడ్డి, గురవయ్య, నాగరాజు, సునీల్‌రెడ్డి, రాధారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి



ప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న వైసీపీ నాయకులు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయనను వైసీపీ సీనియర్ నాయకులు అర్జునగారి మురళి, బత్తిని చంద్రశేఖర్, చెంజి సుబ్బరాయులు, చెంచు కుమార్, కోటిరెడ్డి సన్మానించారు.

తుడా క్వార్టర్స్‌లో చోరీ

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని మంగళం తుడా క్వార్టర్స్‌లో జరిగిన చోరీ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. తిరుచానూరు పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ జగన్నాథం వివరాల మేరకు... స్విమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎ.ఆర్.నరేంద్రబాబు తుడా క్వార్టర్స్‌లోని హౌస్ నెంబరు 81లో నివాసముంటున్నారు. భార్య అనారోగ్యంతో బాధపడుతుండగా ఐదో తేదీ ఉదయం స్విమ్స్‌కు తీసుకెళ్లారు. చిత్తూరులో చదువుకుంటున్న కుమారుడు రేవంత్ తల్లిని చూసేందుకు శనివారం ఆస్పత్రికి వచ్చాడు. రాత్రి తుడా క్వార్టర్స్‌లోని ఇంటి వద్దకు చేరుకున్నాడు. తలుపులు, బీరువా, ఇతర లాకర్లు తెరిచి ఉండడంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని తండ్రికి విషయం చెప్పాడు. ఆదివారం ఉదయం తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ జగన్నాథం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల తనిఖీ

దక్కిలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవాయపాళెం క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఎస్‌ఐ శివశంకర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా తిరుగుతున్న వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10 వేల జరిమానా విధిస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.

సిమెంట్ రోడ్ల పనుల పరిశీలన

చిట్టమూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): చిట్టమూరులో జరుగుతున్న సిమెంట్ రోడ్ల పనులను టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్‌నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సహకారంతో చిట్టమూరు, కొత్తగుంట గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఎస్సీ కాలనీలోని ప్రతి వీధిలో సిమెంట్ రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ అధికారి జగదీష్, చిట్టమూరు సర్పంచు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తదితరులు

నాయుడుపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట స్వర్ణముఖినది పరివాహక ప్రాంతంలోని ప్రసూనాంబసమేత నీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం భీష్మ ఏకాదశి పూజలు జరిపారు. మద్దాలి సోమశేఖర్‌రెడ్డి, ఇందిరమ్మ దంపతులు మృత్యుంజయ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గూడూరు సుధీర్‌రెడ్డి, ప్రధానార్చకుడు బాలాజీస్వామి, కమిటీ సభ్యులు గూడూరు ప్రభావతమ్మ, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, అవధానం సుధీర్, అంకయ్య, సునీల్‌స్వామి, శిల్పారెడ్డి, సాహిత్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పులికాట్ సందర్శించిన రాష్ట్ర వన్యప్రాణి విభాగ ముఖ్య అధికారి



పులికాట్ సరస్సులో బైనా క్యులర్ ద్వారా పక్షులను వీక్షిస్తున్న ఏకే ఖాన్, పక్కన డిప్యూటీ సీఎఫ్ హారిక, రేంజర్ నరసింహారావు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సును రాష్ట్ర వన్యప్రాణి విభాగం ముఖ్య అధికారి ఏకే ఖాన్ ఆదివారం సందర్శించారు. ముందుగా ఆయన అటకానితిప్ప వద్దనున్న పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలించి, అక్కడ వసతుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. అనంతరం సూళ్లూరుపేట - శ్రీహరికోట మార్గంలో ఉన్న పులికాట్ సరస్సును సందర్శించి పక్షులను వీక్షించారు. ఆయన వెంట డిప్యూటీ సీఎఫ్ హారిక, రేంజర్ నరసింహారావు, సిబ్బంది ఉన్నారు.

ఎఫ్ఆర్‌వోల అసోసియేషన్ తిరుపతి సర్కిల్ అధ్యక్షుడిగా దొరస్వామి

మంగళం, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అటవీ క్షేత్రాధికారుల (ఎఫ్ఆర్‌వోలు) అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల సమావేశం ఆదివారం తిరుపతి - కరకంబాడి మార్గంలోని బయో ట్రిమ్‌లో నిర్వహించారు. తిరుపతి సర్కిల్ అధ్యక్ష, కోశాధికారి పోస్టులకు ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా దొరస్వామి, కోశాధికారిగా బి.ప్రియాంకను ఎన్నుకున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.లక్ష్మీపతి, తిరుపతి సర్కిల్ కమిటీ ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులు బి.రామానాయక్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి



పీహెచ్‌సీలో అదనపు భవన నిర్మాణ భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ నేతలు, వైద్యులు, సిబ్బంది

చిల్లకూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని చింతవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రూ.39.81 లక్షలతో నిర్మిస్తున్న నూతన భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో రూ.39.81 లక్షల వ్యయంతో నూతన భవనాన్ని నిర్మించి ల్యాబ్, కంప్యూటర్ గది, స్టోర్‌రూమ్, రిసెప్షన్‌గది, వెయిటింగ్ హాల్, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పీహెచ్‌సీలో 24 గంటలు వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, చిరంజీవి, వెంకటకృష్ణయ్య, పద్మజ, శివకుమార్, మునిశేఖర్‌గౌడ్, నాగరాజు, వెంకటేశ్వర్లు తదితరుల పాల్గొన్నారు.

క్రికెట్ అసోసియేషన్‌కు రూ.50వేల విరాళం

చిల్లకూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల సీనియర్స్ క్రికెట్ అసోసియేషన్‌కు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ రూ.50వేలు విరాళంగా అందజేశారు. మండలంలోని కలవకొండ గ్రామంలో నిర్వహిస్తున్న మండల సీనియర్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన సీనియర్ క్రీడాకారులంతా కలిసి అసోసియేషన్ ఏర్పాటు చేసి క్రికెట్ పోటీలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి కూడా క్రికెట్ అసోసియేషన్‌కు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో నాగరాజు, చిరంజీవి, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు తీగల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలోని ఉగ్గుముడి, మంగళంపాడు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకొని పొదలను తలపిస్తుండడంతో ఆంధ్రజ్యోతిలో 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన వార్త ప్రచురితం కావడంతో విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. సూళ్లూరపేట రూరల్ ఏఈ పూర్ణిమ ఆదివారం సిబ్బందితో వెళ్లి ఆయా గ్రామాల్లో విద్యుత్ లైన్లను పరిశీలించారు. స్తంభాలకు అల్లుకున్న చెట్ల తీగలను తొలగించారు.

'సీపీఆర్ మంగళ' అపార్ట్‌మెంట్ ప్రీ బుకింగ్ ప్రారంభం



సీపీఆర్ అపార్టుమెంట్ ప్రీ బుకింగ్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్లు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మంగళం పరిధిలో అధునాతనంగా నిర్మించిన 'సీపీఆర్ మంగళ' 2బీకే అపార్టుమెంట్ ప్రీ బుకింగ్‌ను ఎండీ కేవీ చలపతి ఆదివారం ప్రారంభించారు. కరకంబాడి రోడ్డులోని ఎంఆర్ఎఫ్ షోరూం ఎదురుగా సీపీఆర్ అపార్టుమెంట్ ప్రత్యేక ఆకర్షణీయంగా నిలుస్తోందన్నారు. ప్రీమియం లోకేషన్, మోడర్న్ డిజైన్, ఆర్కిటెక్చర్, సెక్యూరిటీ, సేఫ్టీ, పార్కింగ్, క్లబ్‌హౌస్, పార్కు, పాఠశాలలు, హాస్పిటల్స్, షాపింగ్‌మాల్స్‌కు అత్యంత సమీపంలో ఉందని వివరించారు. ఆరంభ ధర రూ.37లక్షలుగా నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు 9492013322/66/88 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ ప్రారంభోత్సవంలో డైరెక్టర్లు కాశీ, లోకేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, ప్రైవేట్‌కు అప్పగించాలని రాష్ట్ర మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జేఏసీ నాయకులు చినబాబు, జయచంద్ర, నాగవెంకటేష్‌లు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీని ఆయన నివాసం వద్ద కలిసి విన్నవించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీల భర్తీకి సీఎంతో చర్చించాలని కోరారు. నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. తాత్కాలిక నియామకాలను ఆంధ్రప్రదేశ్ కార్పొరేట్ అవుట్ సోర్సింగ్ సంస్థ ద్వారా నియమించాలని కోరారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

మైనారిటీ సంక్షేమ పథకాల పునరుద్ధరణకు వినతి


షరీఫ్‌ను సన్మానిస్తున్న షౌకీరాలి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్‌ను ఆదివారం విజయవాడలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి షౌకీరాలీ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. షౌకీరాలీ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ఎన్నో పథకాలను తీసుకువచ్చిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసిందన్నారు. వాటిని పునరుద్ధరించాలని కోరామన్నారు. ముస్లిం విద్యార్థులు ఉర్దూ భాష అభ్యసించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పార్లపల్లిలో కార్డన్ సెర్చ్


స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పార్లపల్లిలో ఆదివారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేనటువంటి పలు మోటారు బైకులను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు మాట్లాడుతూ చోరీ వాహనాలు, ప్రమాదానికి గురైనప్పుడు వాహనచోదకుడు పారిపోవడం వంటి సంఘటనలను గుర్తించేందుకు ఈ సెర్చ్ ఉపయోగపడుతుందన్నారు.

ఈమార్గంలో వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే


కాలువలో జంతు కళేబరాలు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం మీదుగా గాజులపెళ్లూరు వెళ్లే మార్గంలోని కాలువలో గేదెలు, పందుల జంతు కళేబరాలను పారవేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో దుర్వాసన వెలువడుతోంది. కాలువ సమీపంలో ఎస్సీ బాలికల వసతి గృహం, మార్కెట్ యార్డు ఉన్నాయి. జంతు కళేబరాల దుర్వాసనతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు సెలవులు కావడంతో ఆదివారం సుమారు 27వేలమంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 348, రూ.200 శీఘ్ర దర్శన టిక్కెట్ల ద్వారా 2,290మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,442మంది దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,678మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,165, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 354మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 216మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 100మంది భక్తులు పూజలుచేయించుకున్నారు.

డిజిటల్ గుర్తింపు కార్డులకు వివరాల నమోదు

రేణిగుంట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల్లో లబ్ధికి డిజిటల్ గుర్తింపు కార్డులు పొందాలని వ్యవసాయ శాఖ అధికారి సునీల్‌కుమార్ రెడ్డి రైతులకు సూచించారు. సోమవారం నుంచి ఈ నెల 28వ తేదీలోపు ఆధార్ కార్డుకు లింక్ అయిన సెల్ ఫోన్ నంబరు, పాసుబుక్, ఆధార్ కార్డును సేవా కేంద్రానికి తీసుకెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. వెళ్లలేని వారు అధికారులకు ఫోన్ చేసి వివరాలు చెబితే ఓటీపీ ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. తద్వారా పంటల బీమా, పీఎం కిసాన్ మోజన పంట నష్ట పరిహారం, అన్నదాత సుఖీభవ పథకాల కింద లబ్ధితో పాటు వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీలు పొందవచ్చన్నారు.

భారీ వాహనం తిష్టతో ప్రజలకు ఇక్కట్లు


పోలీస్ స్టేషన్ దగ్గర ఏడాదిగా కదలని బస్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఏడాదిగా ఓ బస్ భారీ రోడ్డుమీద తిష్ట వేయడంతో ప్రజలకు అసౌకర్యమేర్పడుతోంది. రూరల్ పోలీస్‌స్టేషన్ పక్కన సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దారు, ఎన్నికల సబ్ ట్రెజరీ, సబ్‌జైలు తదితర కార్యాలయాలు ఉన్నాయి. ఈ మార్గంలో నిత్యం ప్రజలు పెద్దసంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఏడాది క్రితం పోలీస్‌స్టేషన్ ఎదుట బస్ పెట్టారు. దసరా సమయంలో శీతలాంబ ఆలయం తరఫున పడిరోజుల పాటు వేడుకలు నిర్వహిస్తుంటారు. భారీ వాహనం అడ్డంగా ఉండటంతో గత ఉత్సవాల్లో ఇబ్బందులు ఎదురయ్యాయని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



వరదయ్యపాళెం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ మల్లికార్జున సూచించారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని బస్టాండు, కదూరు జంక్షన్ వద్ద హెల్మెట్ లేని ద్విచక్ర వాహనచోదకులను ఆపి కేసులు నమోదు చేశారు. ఆటోలో పరిమితికి మించి ఎక్కిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సరైన పత్రాలు లేని పక్షంలో వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు

ముక్కంటి సేవలో రాజస్థాన్ ఎమ్మెల్యే


ఆలయం వద్ద ఎమ్మెల్యే మహంత్ బాలక్‌నాథ్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామిని రాజస్థాన్ ఎమ్మెల్యే మహంత్ బాలక్‌నాథ్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అర్చకుడికి ఎమ్మెల్యే నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రామగిరి వాలీశ్వర ఆలయ ప్రధాన అర్చకుడు మోహన్ గురుకుల్ శనివారం శివైక్యం చెందారు. ఎమ్మెల్యే ఆదిమూలం ఆదివారం ఉదయం వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, అరణియార్ ఆయకట్టు సంఘం చైర్మన్ రవిరెడ్డి, ఆదవి శంకరాపురం చెరువు ఆయకట్టు చైర్మన్ పద్మరాజు ఉన్నారు.

స్కూటరిస్టుకు గాయాలు

పిచ్చాటూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సార్ పెట్రోల్ బంకు సమీపంలో తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై కారు ఢీకొని ఓ స్కూటరిస్టుకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా...తమిళనాడుకు చెందిన సుబ్రహ్మణ్యం ఆదివారం ద్విచక్ర వాహనంపై వస్తుండగా కారు ఢీకొంది. అతడు గాయపడి రోడ్డుపై పడిపోయాడు. క్షతగాత్రుడిని నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

రేణిగుంట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : నులి పురుగులపై పిల్లల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ చరిత ప్రకాష్‌రెడ్డి సూచించారు. సోమవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని అంగన్వాడీ, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో 400 మిల్లీ గ్రాముల ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కొంకి పురుగులు, నులి పురుగులు, బద్ద పురుగుల నివారణకు ఈమాత్రలు దోహదపడతాయన్నారు.

ఆక్రమణల తొలగింపు
● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వరదయ్యపాళెం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వీకేఆర్‌పై కాలువలో ఆదివారం అధికారులు ఆక్రమణలు తొలగించారు. ఆంధ్రజ్యోతిలో ఇటీవల ఆక్రమ కట్టడాలపై వార్త ప్రచురితమైంది. దీంతో తహసీల్దారు రాజశేఖర్ స్పందించారు. ఆక్రమణలను నిలుపదల చేయించారు. వీఆర్వో చలపతి, వీఆర్‌ఏ రామచంద్రయ్యను అక్కడికి పంపి ఆక్రమ కట్టడాలకు ఉన్న రేకులను తొలగించారు.

సేంద్రియ సాగుపై పెరుగుతున్న ఆసక్తి


సేంద్రియ విధానంలో మిరప సాగు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రైతులు సేంద్రియ వ్యవసాయం పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగానే మండలంలో ముగ్గురు ఐసీఆర్‌పీలను నియమించింది. గాజులపెళ్లూరులో 60 మంది 80 ఎకరాలు, నీర్పాకోటలో 40 మంది 50 ఎకరాలు, బీఎన్‌కండ్రిగలో 40 మంది 60 ఎకరాలు, కనమనంబేడులో 25 మంది 15 ఎకరాలు, ఆలత్తూరు 60 మంది,40 ఎకరాలు, పీఏస్‌పురంలో 35 మంది 50 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో వరి, మిరప పంట, వంగ, నిమ్మ, పత్తి, బూడిద గుమ్మడి, తెల్ల నువ్వులు సాగు చేస్తున్నారు. బీఎన్‌కండ్రిగలో కొందరు పలువురు ఇళ్ల దగ్గర కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసుకున్నారు. ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ అధికారి రామాంజనేయులో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు. సహజ యోగ గురువు సురేష్ నాయుడు కూడా రైతులను చైతన్య పరుస్తున్నారు.

జీవామృతం తయారీ: 22లీటర్ల నీరు, 20 కిలోల ఆవు పేడ, 10 లీటర్ల ఆవు మూత్రం, రెండు కిలోల శనగ పిండి, రెండు కిలోల బెల్లం, గుప్పెడు పుట్ట మట్టి మిశ్రమం చేసి కలిపి జీవామృతం తయారు చేసుకోవాలి. దీనిని పంటలకు స్ప్రే చేస్తే తెగుళ్ల సోకవు.


జీవామృతం తయారు చేస్తున్న రైతు

ఘన జీవామృతం తయారీ : వంద కిలోల ఆవు పేడ, కిలో బెల్లం, కిలో శనగపిండి, 5లీటర్ల ఆవు మూత్రాన్ని కలిపి వారం రోజులు నీడలో ఆరబెట్టాలి. తరువాత ఈ ఘనజీవామృతాన్ని వరి, మిరప, వేరుశెనగ పంటల్లో అడుగుమందుగా వాడుకుంటే దిగుబడి బాగా వస్తుంది.

వేప బెల్లం: 10 కేజీల వేపాకు వ్యర్థాలు, 2 కిలోల బెల్లం కలిపిన మిశ్రమాన్ని పంటకైన స్ప్రే చేస్తే పురుగులు చనిపోతాయి.

బ్రహ్మాస్త్రం: వామిలాకు, కానుగ, జామాకు, ఇళ్ల దగ్గర దొరికే 12 రకాలు గుబ్బ ఆకులు, రెండు కిలోల మిరపపొడి, కిలో అల్లం ముద్ద, 2 కిలోల ఉల్లిపాయ ముద్ద, 200గ్రాముల పసుపు కలిపి కలాయంలో ఉడక బెట్టాలి. అందులో రసాన్ని వాడుకోవచ్చు.


ఘన జీవామృతం తయారు చేస్తున్న రైతులు

8 ఎర్రచందనం దుంగల స్వాధీనం



వరదయ్యపాళెం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తొండమందుట్టు అడవుల సమీపంలో రవాణాకు సిద్ధంగా ఉంచిన ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ మల్లికార్జున కథనం మేరకు ఎంజీనగర్ కేంద్రంగా ఎర్రచందనం అక్రమ రవాణా సాగుతుందనే సమాచారంతో శనివారం రాత్రి పోలీసులు నిఘా పెట్టారు. ఎంజీ నగర్ గిరిజనకాలనీకి దూరంగా ఖాళీప్రదేశంలో తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 8 ఎర్రచందనం దుంగలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారుతో పాటు మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకను గమనించి నిందితులు పరారయ్యారు.

ప్రత్యేక శోభకు సన్నాహాలు


కొత్త డివైడర్ నిర్మాణ పనులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి క్షేత్రంలో శ్రీ అంటే సాలీడురు, కాళ అంటే పాము, హస్తి అంటే ఏనుగు. ఈ మూడు మూగజీవులు ఇక్కడి క్షేత్రంలో ముక్తి పొంది శివైక్యం చెందినట్లు ఐతిహాసాలు పేర్కొంటున్నాయి. ఈ మూడు మూగజీవులు వాయులింగేశ్వరుడ్ని పూజించే ప్రతిబింబాన్ని శ్రీకాళహస్తిలో ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈక్రమంలో ఏపీసీడ్స్ కూడలి నుంచి రామసేతు వంతెన వరకు ఉన్న పాత డివైడర్‌ను తొలగించారు. వేరు వ్యవస్థ భూమిలోకి చొచ్చుకుపోయి మొక్కలు పెరిగేలా కొత్త డివైడర్ల నిర్మాణం చేపట్టారు. ఇప్పుడుభాగమైన చెట్లను పెంచి,సాయంత్రం శ్రీకాళహస్తి ప్రతిమలు దేదీప్యంగా ప్రకాశించేలా ఆధునాతన స్తంభాలను ఏర్పాటు చేయనున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు(35) మృతి చెందాడు. శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు ఆదివారం ఓ యువకుడు ద్విచక్ర వాహనంలో వెళుతూ తొట్టంబేడు మండలం పెద్దకన్నలి వద్ద జాతీయ రహదారిపై అదుపు తప్పి పడ్డాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

మహిళకు తీవ్రగాయాలు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడటంతో గుర్తు తెలియని మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన శ్రీకాళహస్తిలోని బలరాం థియేటర్ వద్ద జరిగింది. ఆదివారం మధ్యాహ్నం ఓ యువకుడు తన సమీప బంధువు అయిన మహిళతో ద్విచక్ర వాహనంలో వెళుతున్నాడు. థియేటర్ వద్ద వాహనం అదుపు తప్పడంతో వెనుకకూర్చున్న మహిళ రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

వ్యాసాశ్రమంలో నేటి నుంచి అఖండ గురుపూజోత్సవాలు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఏర్పేడులోని వ్యాసాశ్రమంలో సోమవారం నుంచి అఖండ గురుపూజ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఆశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి పర్యవేక్షణలో 88వ మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు.

వరదరామేశ్వరునికి ప్రత్యేక పూజలు



గుడిమల్లంలో వరదరామేశ్వరస్వామికి ఆదివారం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి దర్శనం కల్పించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ చైర్మన్ గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి ప్రసాదాలు అందజేశారు.

దుకాణాల తొలగింపు



బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రోడ్డు పక్కన చేపల దుకాణాలను ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు ఆదివారం తొలగించారు. ఆక్రమణలతో ఈప్రధాన రహదారి కుంచించుకుపోయింది. ఆదివారం రోడ్డు చేపల వ్యాపారంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ఎస్‌ఐ సిబ్బందితో వచ్చి దుకాణాలను తొలగించారు. రోడ్డు దగ్గర వ్యాపారాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు ప్రదోష పూజలు

పిచ్చాటూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): సిద్ధిరాజకండ్రిగలోని గౌరీ సమేత సోమనాథేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రదోష కాల పూజలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త జ్యోతిరాజు తెలిపారు. సందర్భంగా, సోమనాథేశ్వర స్వామికి ఏకకాల అభిషేకాలు, పుష్పాలంకరణ, ఉత్సవమూర్తుల ప్రాకార ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతుల బకాయిలు చెల్లించండి

పిచ్చాటూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చెరకు రైతులకు తక్షణమే బకాయిలను చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్దన్ డిమాండ్ చేశారు. నేతన్న షుగర్స్ ఫ్యాక్టరీ యాజమాన్యం రూ. 35 కోట్లు, మయూర ఫ్యాక్టరీ యాజమాన్యం రూ.20 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని ఈ మొత్తం చెల్లించేలా చూడాలని కోరారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రేణిగుంటలోని ఇన్నాంటి జీనస్ పాఠశాలలో ఆదివారం జిల్లాస్థాయి అబాకస్ పోటీలు జరిగాయి. ఇందులో ఓం నారాయణ విద్యార్థులు ప్రతిభ చూపారు. ప్రతిభ చూపిన హేమసాగర్, లేఖ్య బ్రహ్మీ, గౌతమీలను కరస్పాండెంట్ చింతా మోహన్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుజ్జమ్మ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ఇక ప్రతి సోమవారం పీజీఆర్ఎస్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీలో ఇక ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇంతకాలం సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక పట్టణ ప్రజలు ఇబ్బంది పడేవారు. మున్సిపాలిటీ పరిధిలో 13 సచివాలయాలు, అధికారులు, సిబ్బంది ఉన్నా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడం లేదు. ప్రధానంగా పారిశుధ్య సమస్యలు ప్రజలను బాధిస్తోంది. మురుగు ఎక్కడికక్కడ స్తంభించిపోతోంది. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి రూ.13 కోట్లు కేటాయించినా పనులు ప్రారంభంలో జాప్యం నెలకొంది. వివిధ పంచాయతీల్లో సౌకర్యాలు కల్పించలేదు. గత ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదు. ఎట్టకేలకు పీజీఆర్ఎస్ అమలు శుభపరిణామమని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

వడమాలపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఉచితంగా అందజేసే రేషన్ బియ్యాన్ని కేజీ రూ.15 రూపాయలకు కొనుగోలు చేసి కొందరు ఎస్వీపురం కేంద్రంగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఆటోల్లో రేణిగుంట, తిరుపతి పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు గ్రామాల్లో తిరుగుతూ రేషన్ బియ్యం కొనుగోలు చేసి తమిళనాడుకు తరలిస్తున్నారు. తాజాగా శనివారం ఎస్వీపురం పంచాయతీ పరిధిలో జనావాసకోటలు వద్ద 524 కేజీల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రేణిగుంట మండలం కరకంబాడికి చెందిన మునిరాజ, గురుమూర్తిలపై ఎస్‌ఐ ధర్మారెడ్డి కేసు నమోదు చేశారు.

శాస్త్రోక్తంగా కలశ స్థాపన

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):కాపు వీధి(రెడ్డిగుంట వీధి)లోని సుందర వినాయక స్వామి వారి జీర్ణోద్ధరణ, అష్టబంధన మహా కుంభాభిషేక కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ కలశ స్థాపన శాస్త్రోక్తంగా జరిగింది. సోమవారం ఉదయం 8.45 గంటలకు మహా పూర్ణాహుతి, 9.30 గంటలకు గోపుర విమాన కుంభాభిషేకం, 10.30 గంటలకు పరివారం, సుందర వినాయకస్వామి మహా కుంభాభిషేకం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

కొత్త సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి : భానుప్రకాష్


భానుప్రకాష్‌ను సత్కరిస్తున్న అధికారులు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): అధిక లోడు విద్యుత్ సమస్యలను అధిగమించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఎస్పీడీసీఎల్ అధికారులకు సూచించారు. ఆదివారం తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. కొత్త విద్యుత్ లైన్ల పనులను వేగంగా చేపట్టాలన్నారు. వడమాలపేట మండలంలోని ఎస్వీ పురం వద్ద 132/33 కెవి సబ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనల అంశంపై చర్చించారు. ఎస్పీడీసీఎల్ పుత్తూరు ఈఈలు వైవి ఆర్కిడాల, బాలాజీ, డీఈఈ భాస్కర్ నాయుడు, ఏఈ భాస్కర్ పాల్గొన్నారు.

ఆలయ కుంభాభిషేకంలో రోజా పూజలు


మాజీ మంత్రి రోజాకు స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

పుత్తూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పుత్తూరులోని కాపువీధిలో నిర్మించిన శ్రీసుందర వినాయక స్వామి ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవంలో ఆదివారం మాజీ మంత్రి రోజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, వేదపండితులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ, రూరల్ అధ్యక్షుడు ఏకాంబరం, లోకనాథం, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం

పుత్తూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పుత్తూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం డివిజన్ నాయకులు మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవులు సాధన, పదివేల మంది ఎమ్మెల్సీలను శాసన మండలికి పంపిన ఘనతను సంఘం సాధించిందన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ కోసం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సదాశివం, రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, నాయకులు తుకారాం, ప్రసాద్, జానకిరామన్ పాల్గొన్నారు.

వైభవంగా మహా రుద్రాభిషేకం

వడమాలపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక భవాని శంకర్ దేవాలయంలో ఆదివారం మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం మహాలింగానికి వేదమంత్రాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. పురోహితులు శివ, సాయిల ఆధ్వర్యంలో రుద్రహోమం, శాంతి హోమం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కల్లూరుకు చెందిన సుదాకర్ రెడ్డి, ప్రమీల దంపతులు అన్నదానం చేశారు.